క్లుప్తంగా

శనీశ్వరస్వామికి పూజలు



శనీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మాధవరం రోడ్డులో వెలిసిన శనీశ్వరస్వామి ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారి రంగప్ప ఆచారి భక్తులు తెచ్చిన నువ్వుల నూనెతో ప్రత్యేకంగా అభిషేకం చేశారు. అలాగే పంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహామంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శంకరమఠంలో శనిత్రయోదశి పూజలు

పట్టణంలోని తిరుమలనగర్‌లో శ్రీ శారద శంకరమఠంలో శనివారం శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. కాశీ క్షేత్రం నుంచి తెచ్చిన శివలింగానికి మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, తిలతైలాభిషేకం, షోడశ ఆవరణ పూజ తదితర కార్యక్రమాలు జరిగాయి.

మంగరాయస్వామికి వెన్న అలంకరణ



వెన్న అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామికి శనివారం వెన్న అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్ మంగరాయ ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, తేనాభిషేకం చేశారు. అనంతరం భక్తులు రాఘవేంద్ర ఆచారి ఏడు కేజీల వెన్నతో మంగరాయ ఆంజనేయస్వామిని అలంకరించారు. అదేవిధంగా స్వామివారికి వెన్నతోపాటు తులసీహారం, పూల అలంకరణ, ఆకుపూజ నిర్వహించారు.


పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



కేఎండీ వలితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడ, కృష్ణలంకలో నిర్వహించిన 17 సంవత్సరాల్లోపు 74 కేజీల విభాగం పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక ఎస్ఎంఎస్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కేఎండీ వలి కాంస్య పతకం సాధించాడు. పతకం సాధించిన విద్యార్థిని పాఠశాల హెచ్ఎం శోభ శనివారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అస్లాం బాషా, ఉపాధ్యాయులు హరికృష్ణ, మోహన్, యాదవ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

పరామర్శ



శ్రీనివాసులును పరామర్శిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్న నందవరం మండలంలోని హాలహర్వి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ శ్రీనివాసులును శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొన్నారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, మాజీ ఎల్లెల్సీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విరూపాక్షిరెడ్డి, శాంతిరాజు, బజారి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీలు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రీతి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని చెన్నాపురం గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్లకు సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు సమయపాలన పాటించాలన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా పిల్లలకు అందించాలన్నారు.

స్టైఫండ్ ఇవ్వాలి

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ విద్యార్థులకు స్టైఫండ్ అందించాలని పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. ఆదోని పట్టణంలో శనివారం పద్మావతి కళాశాల నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరేష్, తరుణ్, లిఖిత, మమత, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల చదువులకు భరోసా ఏదీ?

- పేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూతనిచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- విద్యా దీవెన, వసతి దీవెనతో ఆర్థిక సాయం
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించని వైనం
- ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న కళాశాల యాజమాన్యాలు



ఆదోని సెంట్రల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు,అగ్రవర్ణ పేద విద్యార్థుల ఎలాంటి ఆటంకం లేకుండా ఉన్నత చదువులకు భరోసా కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందో తెలియదు. మరోపక్క కళాశాలలో ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందో లేదో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

భరోసా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించేందుకు గత ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చదువులకు ఆటంకం లేకుండా ఏటా క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లుల ఖాతాలో డబ్బులను జమ చేస్తూవచ్చింది. పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌తో పాటు జగనన్న వసతిదీవెన కింది రూ.10 వేల నుంచి 20 వేల వరకూ ఆర్థికసాయం అందించేది. ఎస్సీ.ఎస్టీ, బీసీ, కాపు, ఈ బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అర్హతే కొలమానంగా తీసుకొని ఉన్నత చదువులకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తూ వచ్చింది.

గతంలో ఎప్పటికప్పుడు చెల్లింపులు

గత ప్రభుత్వం గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో డిప్లొమో, డిగ్రీ, ఇంజినీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి కోర్సులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా చదువుకునే అవకాశం కల్పించింది. పేద, మధ్య తరగతి విద్యార్థులు కళాశాలకు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించేది. విద్యార్థులకు ఆర్థికంగా భరోసాగా నిలిచేలా వసతి దీవెన కూడా అందించేది. ఐటీఐ కోర్సు చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ. 10వేలు, పాలిటెక్నిక్, ఇతర డిప్లొమో కోర్సులకు రూ. 15వేలు, డిగ్రీ ఆ పై కోర్సుల చదివే విద్యార్థులకు రూ. 20వేలు చొప్పున జగనన్న వసతి దీవెన పథకం కింద అందించింది. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు సైతం ప్రభుత్వం ఆర్థిక తొడ్పాటు అందించింది, జగనన్న విద్యాదీవెన పథకం కింద ఎస్టీ, ఎస్సీ, బీసీ మైనార్టీ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా టాప్ యూనివర్సిటీలలో చదువుకునే వెసులు బాటు కల్పించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడం విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. బకాయిలను విడుదల చేయాలని విద్యార్థుల సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

ఫీజుల కోసం ఒత్తిడి

ఆదోనిలో ఒక ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, రెండు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల ఉంది. ఈ కాలేజీల్లో దాదాపు 10వేల మంది దాకా విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో దాదాపు 8 వేల మంది దాకా ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఫీజురీయిబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో కళాశాలల్లో ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. ఫీజురీయిబర్స్‌మెంట్ వస్తే చెల్లిస్తామని విద్యార్థులు తల్లిదండ్రులు చెప్పినా పట్టించుకోవడం లేదు. మాకు అవన్నీ తెలియదు ఫీజులు చెల్లించాల్సిందేనని, ప్రభుత్వం ఇస్తే మీరే తీసుకోండి అని కరాఖండిగా చెబుతున్నారు.

ఎదురుచూస్తున్నాం



నేను సాయి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతున్నాను. మాది వ్యవసాయ కుటుంబం కూలీ పనులను చేసుకొని జీవనం చేస్తున్నాం. ఫీజులను చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాము. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ అందిస్తే ఫీజుల భారం తగ్గుతుందని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఫీజులపై ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. అసలు ఫీజురీయింబర్స్‌మెంట్ వస్తుందో రాదో తెలియదు. ప్రభుత్వం స్పందించి సకాలంలో ఫీజులు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలి.

– నాగరాజు, డిగ్రీ విద్యార్థి

ఎంతగానో ఉపయోగపడ్డాయి



నేనే ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాను. పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి, గతేడాది వసతిదీవెన కింద రూ. 9,000లు విద్యాదీవెన కింది రూ. 3,000లు అందించారు. రెండవ సారి రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ ఎన్నికలు రావడంతో నిలచి పోయాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజులతో పాటు ఈ ఏడాదికి సంబంధించి ఫీజులు చెల్లించాల్సి ఉంది. అయితే ఇంతవరకు ఫీజు చెల్లించలేదు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నాం.

– దేవరాజు, డిగ్రీ విద్యార్థి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆదోని సెంట్రల్: నేటి యువకులు చేడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని కర్నూలు మేత్రసన బిషప్ గోరంట్ల జ్వానేష్ అన్నారు. శనివారం అరసీఎం చర్చిలో యువతీ, యువకులకు ఉపాధి శిక్షణ, ఉద్యగ అవకాశాలు అనే అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పిల్లవాడు సన్మార్గంలో నడవాలంటే భక్తి మార్గం ఎంతో అవసరమన్నారు. భక్తిని అనుసరించడం ద్వారా మన జీవితంలో శాంతి లభిస్తుందన్నారు. ప్రతి యువతీ యువకులు చదువుపట్ల ఆసక్తిని కలిగి ఉన్నప్పుడే ఉన్నత శిఖిరాలకు చేరుకోగరని తెలిపారు. యవతీయువకులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని చెప్పారు. శిక్షణను యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురువులు ఆదోని డీన్ కోలా విజయ్, యువత డైరెక్టర్ రాజేంద్ర, ఫాదర్ జాన్ డెవిడ్, ఫాదర్ చిన్నప్ప, ఫాదర్ జోసఫ్, ఫాదర్ సురేష్, ఉపాధ్యాయులు ప్రభుదాసు, నవీన్ బాలరాజ్ చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నూలు మేత్రాసన బిషప్ గోరంట్ల జ్వానేష్

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్, రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘునాథ్, షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశారు. శనివారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ దాదపు రూ. 500కోట్లు వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఫీజులు చెల్లించలేక పోవడంతో ఉత్తీర్ణులైన విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉండిపోయాయన్నారు. ఫీజులు చెల్లిస్తే కాని సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినా కళాశాల యాజమాన్యం మాత్రం ఫీజులను వసులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమములో అర్‌యూఎస్ఎఫ్, అర్‌పిఎస్ఎఫ్ నాయకులు నరసింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

నందవరం: రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని మిట్టసోమపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు అర్జీల అందించాలన్నారు. అర్జీల రూపంలో అందించిన వాటిని పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, ఇన్‌చార్జ్ ఆర్ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రెవిన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

ఎమ్మిగనూరురూరల్: ప్రజలు రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చునని తహసీల్దార్ శేషఫణి అన్నారు. శనివారం మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 33 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరంలో ఉద్రిక్తత

నందవరం: మండల కేంద్రంలో శనివారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఓ సామాజిక వర్గం, ఒక విశ్వహిందూ పరిషత్ కార్యకర్త మధ్య జరిగిన వాగ్వాదం ఈ పరిస్థితికి కారణం. మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో సామాజిక వర్గానికి చెందిన కొంత మంది సభ్యులు మత ప్రచారం చేస్తుండగా ×మీరు ఎలా ప్రచారం చేస్తారని.. విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రచార ప్రముఖ్ ఉపేంద్ర రెడ్డి అడ్డుకున్నాడు. దీంతో మాచాపురం, జగ్గాపురం, పూలచింత గ్రామాలకు చెందిన సామాజిక వర్గానికి చెందిన సభ్యులు సాయంత్రం దాదాపు 200 మందికి పైగా ఉపేంద్రరెడ్డి ఇంటిపైకి దాడికి వెళ్లారు. విశ్వహిందూ పరిషత్ కార్యకర్త ఇంటిలో లేకపోవడంతో ఇంటి ముందు బల్బులు, అద్దాలు ధ్వంసం చేశారు. అక్కడ పరిస్థితిని అదుపుచేయడానికి స్థానిక ఎస్ఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో వెళ్లి సామాజిక వర్గానికి చెందిన సభ్యులను చెదరగొట్టారు. విషయం తెలియడంతో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. దీంతో గ్రామంలో ఉధృతి వాతావరణం నెలకొనడంతో మంత్రాలయం సీఐ బి.రామాంజులు, గోనెగండ్ల సీఐ యుంగధర్, రూరల్ సీఐ మధుసూధన్‌రావుతో పాటు ఎస్ఐలు నాయక్, శ్రీనివాసులు, శ్రీనివాసులు, పోలీసు బలగాలు మోహరించి ఇరు వర్గాలను చెదరగొట్టి, పరిస్థితిని అదుపులోకి తీసుకవచ్చారు.

కురవలను ఎస్సీ కులగణన నుంచి తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: మాదాసి కురవ, మాదారి కురవలను కులగణన జాబితా నుంచి తొలగించాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్ వినతి పత్రాన్ని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసన్న, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బతుకమ్మ, డివిజన్ అధ్యక్షుడు సుమాల చార్లెస్ అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కులగణన జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారన్నారు. ఆ జాబితాల్లో మాదారి, మాదాసి కురవల పేర్లు కూడా ఉన్నాయన్నారు. ఆ పేర్లను తొలగించి ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాజోలప్ప, ప్రసన్న కుమార్, చిన్ని ప్రసాద్, యేసు రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన ఎనలేని పోరాటాలు

ఎమ్మిగనూరుటౌన్: అశేష త్యాగాల చరిత్ర గల పార్టీ సీపీఐ అని, పేదలు, కార్మికుల పక్షాన ఎనలేని పోరాటాలు చేస్తోందని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు భాస్కర్ యాదవ్, సమీవుల్లా అన్నారు. శనివారం స్థానిక 5వ వార్డులోని ఎన్టీఆర్ కాలనీలో సీపీఐ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా పార్టీ జెండాను ఆ పార్టీ నాయకులు బజారి ఆవిష్కరించారు.

మహాసభలను విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆదివారం నుంచి నిర్వహించే సీపీఎం 23వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి రామాంజినేయులు, రాధాకృష్ణ, గురుశేఖర్, గోవిందులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహించిన బైక్ ర్యాలీని నాయకుడు హనుమంతు ప్రారంభించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గోనెగండ్ల : ఎమ్మిగనూరు పట్టణంలో ఆది, సోమవారాల్లో జరిగే సీపీఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, నరసింహులు పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపు జాతా శనివారం మండలంలోని బి. అగ్రహారం, బైలుప్పల, గంజిహళ్లి, గోనెగండ్ల, చిన్నమరివీడు, అలువాల, హెచ్. కైరవాడి గ్రామాలలో సాగింది. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు సుంకన్న, బతకన్న, బాలు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీఎం నాయకుడు హనుమంతు

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

ఎమ్మిగనూరురూరల్: వచ్చే నెల 12న కర్నూలు జిల్లా కేంద్రంలో యాదవ హాస్టల్‌లో నిర్వహించనున్న యాదవ హాస్టల్ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు చింతమానుపల్లె వేణుగోపాల్, ప్యాలకుర్తి వెంకట్రాముడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. యాదవ హాస్టల్‌లో చదువుకున్న వారు దాదాపు 500 మంది వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తున్నారన్నారు. స్నేహితులందరూ ఒకసారి కలవాలని నిర్ణయించుకున్నామన్నారు. హాస్టల్ పూర్వపు విద్యార్థితో పాటు, హాస్టల్ అభివృద్ధి కోరే యాదవ సంఘం నాయకులు హాజరుకావాలని కోరారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

నందవరం/కోసిగి : మండల కేంద్రం నందవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులు సంబంధిత గ్రామ సచివాలయాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలని ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుదర్శనం, కోసిగి సంఘం ఇన్‌చార్జ్ విజయ భాస్కర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే పథకాలకు అర్హత పొందాలంటే రైతులు తప్పని సరిగా వారి ఖాతాలకు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే ఓటు హక్కు కూడా ఉంటుందన్నారు.

ఆశీర్వాదం

కౌతాళం: పెళ్లి రిసెప్షన్ వేడుకల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాల్గొని వధూవరులకు ఆశీర్వాదించారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఈశప్పగౌడ్ తమ్ముడు సిద్ధిరామప్ప కుమారుడు పంపనగౌడ్ అర్చన రిషప్షన్ వేడుకలు శనివారం వల్లూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

నందవరం : గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ డీఈఈ వెంకటేశ్వర ప్రసాద్ హౌసింగ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నందవరం మండలంలో మొత్తం 409 ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. అందులో 160 గృహాలు పూర్తయ్యాయని, 209 ఇళ్లు వివిధ దశలో ఉన్నాయని వివరించారు. మిగిలిన గృహాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మార్చి నెలలలోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జనవరి 3లోపు పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: ఆదోని వెళ్లేదారిలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో శనివారం సాయంత్రం బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు అయ్యాయి. నందవరం మండలం జగ్గాపురం గ్రామానికి చెందిన బోయ రామకృష్ణ మోటార్ బైక్‌పై ఆదోని వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో అతని తలకు, ముఖంపై తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని పోలీస్ రోడ్ సెఫ్టీ వాహనంలో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తాగునీటి పైపులైన్ నిర్మాణం

నందవరం : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బైటిగేరి శివన్న నేతృత్వంలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. శనివారం గ్రామంలో తుంగభద్ర నది నుంచి ఒవర్ హెడ్ ట్యాంకు వరకు పైపులైన్ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్, ఆర్డీప్ సంస్థ కార్యకర్త ఉసేని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మూర్తి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్తతో పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామంలో ఒవర్ హెడ్ ట్యాంకు కనెక్షన్ ఇచ్చి ప్రతి కాలనీకి తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, ఆర్డీప్ సంస్థ కార్యకర్త కరుణప్ప, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బైటిగేరి భీమన్న, దస్తగిరి పాల్గొన్నారు.



నూతన పైపులైన్ వేస్తున్న గ్రామ సర్పంచ్, ఆర్డీప్ సంస్థ కార్యకర్త

నిబంధనలు అందరికీ ఒకేలా ఉండాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు పక్షపాతంగా వ్యవహరించడం సరికాదు
- కౌన్సిల్‌లో వాయిదా పడిన అంశాలకు లోలోపల అనుమతులివ్వడం ఏమిటి?
- మున్సిపల్ కౌన్సిల్‌లో ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు



అధికారులు తీరు మార్చుకోవాలని కౌన్సిల్‌లో వాదిస్తున్న కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్‌లో పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు నిబంధనలు ఒకేలా ఉండాలని, ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఎలా ఉంటాయని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, కౌన్సిలర్ బాలాజీ అధికారులను నిలదీశారు. కౌన్సిల్‌లో అసలు ఏమి జరుగుతుందో పాలకవర్గ సభ్యులకు తెలియడంలేదన్నారు. మెజార్టీగా ఉన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు అధికారులు సమాచారాన్ని ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో సభ్యులు ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ నుంచి బకాయిలు వసూలు చేసినట్లు కౌన్సిల్‌కు సమాచారం లేదన్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పక్షపాతంగా వ్యవహరించడం ఏమిటని వైస్ చైర్మన్ నరసింహులు ప్రశ్నించారు. కౌన్సిల్‌కు తెలియకుండానే కాంట్రాక్టర్‌లకు అనుమతులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. అనుమతులు ఇచ్చే సమయంలో కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ పెడచెవిన పెట్టడంపై తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరు కౌన్సిల్‌కు అవమానకరమన్నారు. కౌన్సిల్‌లో గత మాసాల్లో జరిగిన కొన్ని అంశాలను వాయిదా వేసినప్పటికీ వాటికి సంబంధించిన నిబంధనలు పాటించకుండా అధికారులు లోలోపలే అనుమతులు ఇవ్వడంపై చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. కౌన్సిల్ జరిగిన తర్వాత మినిట్స్ బుక్‌లో ఎవరికి అనుగుణంగావారు పొందుపరచడం ఎంత వరకు సమంజసమని వైస్ చైర్మన్ నరసింహులు ప్రశ్నించారు. ఒక మీదట మినిట్స్ బుక్ కౌన్సిల్ సమావేశానికి తీసుకురావాలని, వాయిదా పడిన అంశాలను సభ్యుల సమక్షంలోనే అందులో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సభ్యుల ఆమోదం మేరకే ప్రతి అంశాన్ని అజెండాలో పెట్టడం, వాయిదా వేసిన అంశాలను మినిట్స్ బుక్‌లో నమోదు చేస్తున్నామని చైర్‌పర్సన్ బోయ శాంత సమాధానంగా చెప్పారు.

అధికారులు తీరు మార్చుకోవాలి..

గత మాసంలో జరిగిన కౌన్సిల్‌లో కొంతమంది కౌన్సిలర్లు ఇంటి పన్నులు బకాయి పడ్డారని ఎమ్మెల్యే డా.పార్థసారథి ప్రకటించడం చూస్తుంటే అధికారులకు చిత్తశుద్ధి లేదన్న విషయం బట్టబయలయ్యిందని, కౌన్సిల్‌లో ఏదేనా సమస్య ఉన్నా పాలకవర్గ సభ్యులు, అధికారులకు తెలియాల్సిన అంశాలు బయటకు ఎలా వస్తున్నాయని కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. కొంతమంది అధికారులు, సిబ్బంది తమ పద్ధతులను మార్చుకోవాలని, లేని పక్షంలో ఇబ్బందులు పడతారని హెచ్చరించారు.

బీజేపీ కౌన్సిలర్ల తీరుతో ఎక్కడి సమస్యలు అక్కడే

పాలకవర్గంలో బీజేపీ మద్దతుదారులు అనుసరిస్తున్న తీరుతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోతున్నాయని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో అభివృద్ధికి ఆటంకంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అడ్డుగా నిలుస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు జరగడం లేదన్న వాస్తవాన్ని ఆదోని ప్రజల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పూర్తిస్థాయిలో పన్నులు చెల్లించినప్పటికీ కొంతమంది కౌన్సిలర్ల పేర్లను కౌన్సిల్‌లో ప్రస్తావన తీసుకురావడం ఏమిటని పాలకవర్గ సభ్యులు రాజేశ్వరరెడ్డి, నరసింహులు, సందీప్‌రెడ్డి, బాలాజీ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్వో సలీమ్, టీపీఓ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

కూలీల వలస బాట

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామం నుంచి శనివారం దాదాపు 30 కుటుంబాలు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరుకు వలస వెళ్లారు. స్థానికంగా ఉపాధి హామీ పనులు ఉన్నా గిట్టుబాటు వేతనం రాకపోవడం, చేసిన పనులకు సకాలంలో కూలి డబ్బులు రాకపోవడంతో తమకు బతకడం చాలా కష్టంగా మారిందని కూలీలు నరసమ్మ, ఈరప్ప, లింగయ్య, ఈరప్ప, రంగమ్మ తెలిపారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు తాము రాయచూరుకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. అక్కడ చేసేందుకు వ్యవసాయ పనులు ఉన్నాయని, రోజుకు రూ.400 నుంచి రూ.500 దాకా గిట్టుబాటు అందుతుందని చెప్పారు.



టెంపోలో మూటాముల్లె సర్దుకుని వలస వెళ్తున్న కూలీలు

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: హెచ్.మురవణికి చెందిన కురవ ఉరుకుందప్పను కొట్టిన పెద్దకడుబూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఏపీ కురవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కురవ ఉరుకుందప్పను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ హెచ్.మురవణి గ్రామంలో కురవ ఉరుకుందప్ప, దాయాదుల మధ్య పొలం విషయంలో మనస్పర్థలు ఉన్నాయని తెలిపారు. సివిల్ పంచాయతీని పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తన చేతిలోకి తీసుకొని స్టేషన్‌కు పిలిపించి ఉరుకుందప్పను విచక్షణా రహితంగా కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు